నమస్తే తెలంగాణ CLASSIFIED

**WANTED**

★SUNEDGE MARKETING కంపెనీ యొక్క ఆర్గానిక్ ప్రొడక్ట్స్ డైరెక్ట్ సెల్లింగ్ పద్ధతి లో మార్కెటింగ్ చేయుటకు స్టోర్ ఒనర్స్, ఏరియా డిస్ట్రిబ్యూటర్స్,టీం లీడర్స్ కావలెను. సెల్ :6281277956
NTK-322127

★RRR కు దగ్గరలో DTCP Approved Layout @ 4999/-. Company లో పనిచేయుటకు Marketing Directors Part Time/ Full Time, Salaried Free-lancers కావలెను. Cont: 8712379382, 9391665516.
NT-318390

**కావలెను**

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-310380-All

**VEHICLE FOR SALE**




★Matuthi Ertiga vdi BSIV-2019 Model Vehicle No. TS02FA1071 Contact: INDUSIND BANK Cell: 9959345748
NTK-316660

**అద్దెకు ఇవ్వబడును**

★కరీంనగర్ రాంనగర్‌లోని వాటర్ ట్యాంక్ ఎదురులో గల 4 రూంలతో కూడిన 3 పోర్షన్‌లు అద్దెకు ఇవ్వబడును. సంప్రదించండి: సెల్: 6301351451, 7893536645
NTK-316661

**CHANGE OF NAME**

★I, KATTA RAVINDAR RAO S/o. KATTA NARAYANA RAO, R/o. 12-131/1, Allipur, Raikal, Jagityal, T.S Changed my name as KATTA RAVINDHAR RAO S/o.KATTA NARAYANA RAO
NT-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.





# సంజయ్ కల్వకుంట్లను ఆశీర్వదించండి

- ఆర్తి గలిగిన నాయకుడు
- చేతి నిండా పని.. జేబునిండా డబ్బు వదులుకొని ప్రజాసేవకు వచ్చిన మంచి వ్యక్తి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

జగిత్యాల, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ)

ప్రజల పట్ల ఆర్తి కలిగిన డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను ఆశీర్వదించి, కోరుట్ల ఎమ్మెల్యేగా ఘన విజయాన్ని అందించాలని నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. రూ.16.80 కోట్ల వ్యయంతో నిర్మించిన వంద పడకల కోరుట్ల ప్రభుత్వ దవాఖానను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కోరుట్ల మినీస్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు. కాంగ్రెస్, ఇతర ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ దవాఖానల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండేదన్నారు. 'నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానకు' అంటూ పాటలు పాడారన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ చేపట్టిన సంస్కరణల వల్ల నేడు సర్కార్ దవాఖానల పరిస్థితి సమూలంగా మారిపోయిందని, ఇప్పుడు 'పోదాం పద సర్కార్ దవాఖానకు' అంటూ పాడుతున్నారన్నారు. అన్ని ప్రభుత్వ దవాఖానాల్లో మౌలిక వసతులు, పల్లె దవాఖానలు, బస్తీ దవాఖానలు, ప్రసూతి కేంద్రాలు, మూత్ర రక్త పరీక్షలు చేపడుతున్నట్లు చెప్పారు. కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో సైతం డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ఎంపిక చేసిన సంజయ్ కల్వకుంట్ల ప్రముఖ వైద్యుడు కావడంతో ఆయనకు ప్రజల ఆరోగ్యంపై పట్టింపు ఎక్కువగా ఉందన్నారు. కోరుట్ల దవాఖానను వంద పడకల దవాఖానగా మార్చుకున్న తరుణంలో డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఎముకల డాక్టర్ కావడంతో, ఆయన వృత్తిని బట్టి, కోరుట్ల దవాఖానకు సీటీ స్కాన్ మిషన్ ఇవ్వాలని కోరారని, మంజూరు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరుట్ల దవాఖాన పైభాగంలో మరో అంతస్తు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారని, అలాగే కొన్ని వైద్య పరికరాల అవసరం ఉందని, వాటిని మంజూరు చేయాలని కోరారని, వీటి కోసం రూ.2.50 కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. కోరుట్ల దవాఖానలో డయాలసిస్ కేంద్రానికి మరో మూడు యూనిట్లను అదనంగా మంజూరు చేస్తున్నామన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు గుర్తించాల్సిన తరుణం ఏర్పడిందన్నారు.

### చర్చకు సిద్ధం..

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పదేండ్ల పాలన, బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అంటున్నారని, ఈ సవాల్‌ను బీఆర్‌ఎస్ స్వీకరిస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి చర్చకు రావాలని, పదేండ్ల కాంగ్రెస్ పాలన, బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనపైనే ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడుగుదామని హరీశ్‌రావు సవాల్ చేశారు. కాంగ్రెస్ హయాంలో ఉచిత కరెంట్ అంటూ ఉత్త కరెంట్‌ను చేస్తే, పదేండ్ల కాలంలో సీఎం కేసీఆర్ కడుపు నిండా కరెంట్ ఇచ్చిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కాలంలో భర్తలు దుబాయ్, బొంబాయి పోతే అక్కాచెల్లెండ్లు సైతం అర్ధరాత్రి పూట భయంభయంగా కరెంట్ పెట్టేందుకు బాయికాడికి పోయారా? లేదా? ప్రజలే చెప్పాలన్నారు. అర్ధరాత్రి కరెంట్ పెట్టేందుకు వెళ్లి పాములు కుట్టి, షాక్‌లు తగిలి మనుషులు చనిపోయిన ఘటనలు లెక్కలేవన్నారు. దొంగరాత్రి కరెంటిచ్చి, రైతన్నలను గోస పెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అయితే, పగటి పూట కరెంట్ భాజాప్తా ఇచ్చి రైతన్నలకు మేలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది అని స్పష్టం చేశారు. ఎస్సారెస్పీ కాలువల్లో నీటి కోసం రైతులు నీళ్ల యుద్ధాలు మరిచిపోయారా? అని మంత్రి ప్రశ్నించారు. ఎస్సారెస్పీ లీకేజీ నీళ్ల కోసం రైతులు ధర్నాలు, యుద్ధాలు చేసేవారని, ఇప్పుడా అ పరిస్థితి ఉందా? అని అన్నారు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా కాలువల నిండా నీరు ఉంటుందని, పంటపొలాలకు కడుపు నిండా నీరు ఇస్తున్నామన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టుల్లో నీళ్లు లేకపోతే, వరద కాలువ ద్వారా కాళేశ్వరం నీటిని ప్రాజెక్టులోకి తెచ్చి, రెండు ఎకరాల పంటను అందిస్తున్నది నిజం కాదా? అని, నిండు గర్భిణిలా వరద కాలువ కనిపిస్తలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కాలువల్లో నీళ్లు ఇవ్వకుండానే నీటి తీరువా వసూలు చేశారని, సీఎం కేసీఆర్ రైతులకు కాలువల నిండా నీరు ఇచ్చి, నీటి తీరువా ఎత్తివేశారన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ పార్టీ ఏనాడైనా ఆలోచించిందా? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ రైతుల కోసం రైతు బంధు, రైతు బీమా, ఉచిత కరెంట్ ఇస్తున్నారన్నారు. ఈ అంశాలపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చర్చకు వస్తారా? అని సవాల్ విసిరారు. ఒకప్పుడు సర్కార్ దవాఖానాల్లో 30 శాతం ప్రసవాలు ఉంటే, నేడు అవి 70 శాతానికి చేరాయన్నారు. పల్లె, బస్తీ దవాఖానలు, డయాలసిస్ సెంటర్లు, టీబీ సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ వైద్యం మెరుగు అయ్యిందన్నారు. వైద్యరంగంలో దేశంలో 11వ స్థానంలో ఉన్న తెలంగాణ కేసీఆర్ సర్కార్ కృషి, తీసుకున్న చర్యలతో దేశంలో 3వ స్థానానికి చేరుకుందన్నారు. కేసీఆర్ కిట్, ఉచిత ప్రసవం, మొదటి రెండు కాన్పులకు రూ.12 వేల ఆర్థిక సాయం చేయడంతోపాటు, తల్లీబిడ్డను ఇంటికి వాహనంలో తీసుకువెళ్తున్న గొప్ప ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతుల వివాహానికి సాయం చేయాలని ఏనాడైనా ఆలోచించిందా? అని నిలదీశారు. కేసీఆర్ సర్కార్ 12.75 లక్షల మంది యువతుల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా సాయం చేసిందన్నారు. కాంగ్రెస్ పాలనకు, బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనకు ఎక్కడైనా పోలిక ఉందా..? అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ గెలిచేది లేదని, బీజేపీ లేచేది లేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ డకౌట్ అవుతుందని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక్క సీటు గెలిచిందని, ఈసారి మాత్రం డకౌట్ అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రనౌట్ అవుతుందన్నారు. బాల్ ముందుకు పోకముందే రన్స్ కోసం ప్రయత్నిస్తే రనౌట్ మాత్రమే మిగులుతుందన్నారు. ఈసారి ఎన్నికల్లో సైతం సీఎం కేసీఆర్ సిక్సర్ కొట్టి హ్యాట్రిక్ కొడుతారన్నారు. రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి ఉత్తదే అని, దానికి ఎన్ని జాకీలు పెట్టినా అది లేచే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ప్రజలను ముంచేవే అని చెప్పారు. కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో ఆడబిడ్డలు బీడీ పరిశ్రమపై ఆధారపడి ఉన్నారని, బీడీ పరిశ్రమను ముంచాలని చూసింది కాంగ్రెస్, బీజేపీ పార్టీలే అని గుర్తు చేశారు. కాంగ్రెస్ పుర్రెగుర్తు వేస్తే, బీజేపీ జీఎస్టీ అమలు చేసి బీడీ కార్మికులను వంచించిందని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ మాత్రమే బీడీ కార్మికులను కడుపులో పెట్టుకొని చూసుకున్నారని, ఎవరూ అమలు చేయని విధంగా బీడీ కార్మికులకు నెలకు రూ.2 వేల పెన్షన్ ఇస్తున్నారని తెలిపారు. 13 రాష్ట్రాల్లో బీడీ పరిశ్రమ ఉందని, ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్, బీజేపీ అధికారంలో ఉన్నాయని, అక్కడ ఎందుకు బీడీ పెన్షన్ ఇవ్వడం లేదో ఆలోచన చేయాలన్నారు. కేసీఆర్ అంటే నమ్మకం అయితే, కాంగ్రెస్ అంటే నాటకం అన్న విషయాన్ని ప్రజలు మరిచిపోవద్దని సూచించారు. 11 సీజన్లలో రూ.72 వేల కోట్ల రైతు బంధును రైతులకు అందజేశారని, దేశంలోని అన్ని రాష్ట్రాలకు కలిపి ప్రధాని మోదీ సైతం ఇంత మొత్తం అందజేయలేదన్నారు. కరోనా కాలంలో ఆర్థిక పరిస్థితి సరిగా లేని సమయంలో సైతం రైతు బంధు ఆపివేయాలన్న ఆలోచన వస్తే, గరీబులైన రైతులను ముంచవద్దని, మంత్రులు, ఎమ్మెల్యేలు, అవసరమైతే ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ఆపివేసైనా సరే రైతుబంధు ఇవ్వాలని చెప్పిన రైతుపక్షపాతి సీఎం కేసీఆర్ అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనను నేడు సమర్థిస్తున్న రేవంత్‌రెడ్డి ఆనాడు టీడీపీలో ఉండి, విమర్శించిన మాట నిజం కాదా? అని ప్రశ్నించారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి, ఊసరవెల్లిలా రంగులు మార్చుతున్నాడని ధ్వజమెత్తారు. యువకుడు, ఉత్సాహవంతుడు, విద్యావేత్త, డాక్టర్ అయిన సంజయ్ కల్వకుంట్లను గెలిపించాలని కోరారు.



కోరుట్ల బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్

### అభివృద్ధి చూసి.. ఆశీర్వదించండి



తొమ్మిదేండ్లలో కోరుట్ల నియోజకవర్గంలో రూ.400 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి చేశాం. సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ అందించిన సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల కలలను సాకారం చేశాం. ప్రతిపక్షాలకు చెందిన కొందరు నాయకులు కళ్లుండి చూడలేని కబోదుల్లాగా ఏం అభివృద్ధి జరగలేదని, మా హయాంలోనే జరిగిందంటూ అసత్యపు ఆరోపణలు చేస్తున్నరు. అలాంటి వారి ఇండ్లకు సున్నం వేయలేను తప్ప అన్ని చేశా. నాలుగు సార్లు నన్ను ఎమ్మెల్యేగా ఆదరించి, ఆశీర్వదించి గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టా. సంక్షేమం, అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్లా. తొమ్మిదేండ్లలో జరిగిన అభివృద్ధి చూసి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నా బిడ్డ డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను ఆదరించి.. ఆశీర్వదించి మరింత అభివృద్ధికి బాటలు వేయాలని కోరుతున్నా. నా రాజకీయ జీవితంలో ఎంతో మంది మంత్రులను చూశా. కానీ, ఏం పనిచెప్పినా నిమిషంలో చేసే మంత్రి ఎవరంటే తన్నీరు హరీశ్‌రావును మాత్రమే చూశా. ఇది నా హృదయం నుంచి చెప్తున్నా.

**-కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు**

### కవిత పోరాటం వల్లే పసుపు బోర్డు



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నాడు ఎంపీగా ఉండి చేసిన పోరాటం వల్లనే ఈనాడు పసుపు బోర్డు ప్రకటన వచ్చింది. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలిగా ఈ ప్రాంత పసుపు రైతుల చిరకాల ఆకాంక్ష అయిన పసుపు బోర్డు కోసం పోరాడారు. ప్రధానితో సహా వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిశారు. పార్లమెంట్‌లో గళమెత్తి కేంద్రం మీద ఒత్తిడి చేశారు. ఆమె పోరాట ఫలితమే పసుపు బోర్డు రావడానికి కారణం. వైద్యశాఖ మంత్రిగా హరీశ్‌రావు జిల్లాకు మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడంలో ఎంతో కృషిచేశారు. తెలంగాణలో బీజేపీ నుంచి నలుగురు ఎంపీలుగా గెలిచారు కానీ, ఏ ఒక్కరూ కనీసం ఒక్క మెడికల్ కళాశాలను కేంద్రం నుంచి మంజూరు చేయించలేదు. వైద్యరంగంలో దేశంలోనే తెలంగాణ మూడో స్థానంలో నిలవడం గర్వకారణం. గుజరాతీలకు గులామ్‌లం కాదు.. ప్రజలకు సేవకులం మాత్రమేననే విషయం బీజేపీ వాళ్లు గుర్తుపెట్టుకోవాలి. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేసుకునేందుకు ప్రజలందరూ బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలి. ప్రజా సేవ కోసం వైద్యవృత్తి నుంచి వచ్చిన డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను ఆదరించాలి. భారీ మెజార్టీతో గెలిపించాలి.

**-జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత**

### అర్వింద్ సంస్కారంలేని మూర్ఖుడు



సీఎం కేసీఆర్ ఆరోగ్యంపై ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ సంస్కారం లేని మూర్ఖుడు. 2019లో మోసపోయి ఎంపీగా ఒక కుసంస్కారిని గెలిపించుకోవడం వల్ల దరిద్రం వచ్చింది. ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. వచ్చే ఎన్నికల్లో మంచిగా పాలించే బీఆర్‌ఎస్‌ను మళ్లీ గెలిపించండి. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బీడీ కార్మికులకు నెలకు రూ.2016 చొప్పున పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే. కరోనా సమయంలోనూ బీడీ కార్మికులు ఇబ్బంది పడకూడదనే గొప్ప ఆలోచనతో సీఎం కేసీఆర్ నెలకు రూ.2 వేలు ఆర్థిక సహాయం అందించిన్రు. వృద్ధులు కూడా తమకు వచ్చే పెన్షన్‌తో గర్వంగా బతుకుతున్నరు. ఎవరికీ చేయిచాచకుండా మూడు పూటల భోజనం చేస్తున్నరు. కోరుట్ల పట్టణంలో వంద పడకల దవాఖాన అంటే కొందరు దరిద్రులు హేలన చేసిన్రు. జోకులు వేసిన్రు. కానీ, ఏడాది లోపు భవనం నిర్మాణం పూర్తి చేసుకుని దవాఖానను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉంది. డయాలసిస్ కోసం ఇది వరకు కరీంనగర్, హైదరాబాద్ వెళ్లేవారు. దీని వల్ల కిడ్నీ బాధితులు ఎంతో ఇబ్బందిపడేవారు. అలాంటి పరిస్థితి ఉండకుండా కోరుట్ల పట్టణంలోనే డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాం. 75 శాతం ప్రభుత్వ దవాఖానాల్లోనే ప్రసూతిలు జరుగుతున్నయి. తొమ్మిదేండ్ల కింద తెలంగాణ ఎట్లుండె. ఇప్పుడు ఎట్లున్నది.. ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రజా సేవకోసం వచ్చిన నన్ను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించండి.. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా కోరుట్ల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తా.

**-బీఆర్‌ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల**